సాక్షి పల్నాడు

బుధవారం । 26 । జూలై । 2023



మంచినీటి చెరువు పరిశీలన

సత్తెనపల్లి: సాగర్ జలాలు విడుదల, వర్షాల నేపథ్యంలో పట్టణంలోని మంచినీటి చెరువును మంగళవారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి పరిశీలించారు.



జడ్జిని నియమించాలి

బాపట్ల: బాపట్లకు రెగ్యులర్ ప్రిన్సిపల్ జూనియర్ జడ్జిని నియమించాలని హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులకు మంగళవారం బార్ అసోసియేషన్ విన్నవించింది.

ఘనంగా పీర్ల ఊరేగింపు



క్రోసూరు: మోహర్రం మాసం పురస్కరించుకుని ముస్లింలు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దొడ్లేరులో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు.

న్యూస్‌రీల్

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు జమచేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎం.విజయభాస్కరరెడ్డి మంగళవారం తెలిపారు. మొత్తం 28 మండలాలకు రూ.17కోట్ల 77 లక్షల 4 వేల 280 జమయ్యాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు జమ చేసిన నిధులను సంబంధిత ఖాతాల్లో పరిశీలించుకోవచ్చని వివరించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలనకు తమిళనాడు బృందం



మేడికొండూరు: జంగంగుంట్లపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం తమిళనాడు పర్యవేక్షణ బృందం సందర్శించింది. విలేజ్ హెల్త్ క్లినిక్ పనితీరు, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి బృందం పరిశీలన జరిపింది. రోగులను వివరాలు అడిగి తెలుసుకుంది. 104 వాహనం పనితీరు పైనా ఆరా తీసింది. బృందంతోపాటు గోవిందరావు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, డీపీఎంఓ సి.హెచ్.రత్నమనోహన్, ఎన్‌హెచ్ఎం డాక్టర్ అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

జీజీహెచ్‌లో ఓపీ వేళలు మార్పు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అవుట్‌పేషెంట్ విభాగంలో రోగుల పేర్లు నమోదు చేసుకునే వేళల్లో మార్పులు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఓపీ విభాగంలో కొత్తగా పది ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో ఇప్పటి వరకు కేవలం ఆరు ఓపీ కేంద్రాలు ఉన్నాయని, ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య 2 వేల నుంచి 3 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కువ సమయం రోగులు వేచి ఉండటం వల్ల సకాలంలో వైద్య సేవలు పొందలేకపోతున్నారని, దీన్ని నియంత్రించేందుకు కొత్తగా పది ఓపీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రాలను రోగులకు అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. త్వరితగతిన అదనపు ఓపీ కేంద్రాలను నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పిల్లలతో తల్లి అదృశ్యం



తెనాలిరూరల్: పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన 29 ఏళ్ల బెజవాడ అనూష తన తొమ్మిదేళ్ల కుమారుడు షణ్ముఖసాయి, మూడేళ్ల కుమార్తె వన్సికని తీసుకుని సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త సీతయ్య మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో అనూష పిల్లలతో కలిసి వెళ్లిపోయినట్లు భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

దుర్గగుడికి డబ్బు చెల్లించండి

ముగ్గురు ఉద్యోగులకు ఈఓ నోటీసులు!

విజయవాడ: ఇంద్రకీలాద్రి శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో 2017, 2019 సంవత్సరాల్లో జరిగిన చీరల గోల్‌మాల్ వ్యవహారం మరోమారు కదిలింది. దేవస్థానం అప్పట్లో భక్తుల నుంచి చీరల సేకరణ, విక్రయాలతో పాటు గోదాములో స్టాక్ నిల్వ చేసింది. ఆ సమయంలో ఈ వ్యవహారాలను ముగ్గురు ఉద్యోగులు చూశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరగడంతో అప్పట్లోనే విషయం బయటకు వచ్చింది. ఉద్యోగులపై దేవదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. అవకతవకలు జరిగిన మొత్తాన్ని చెల్లించాలంటూ దేవస్థానం గతంలోనే నోటీసులు జారీ చేసింది. తాజాగా మంగళవారం మరో మారు ఈ వ్యవహారంపై దుర్గగుడి ఈఓ భ్రమరాంబ దృష్టి సారించారు. గోల్‌మాల్ జరిగిన మొత్తాన్ని తిరిగి దేవస్థానానికి చెల్లించాలని ముగ్గురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం రూ.1.66 కోట్లు, రికార్డ్ అసిస్టెంట్ రమేష్ రూ.20 లక్షలు, మరో ఉద్యోగి మధు రూ.6 లక్షలు చొప్పున పది రోజుల్లో చెల్లించాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

వైద్య సౌధం.. శుభస్య శీఘ్రం

- శరవేగంగా పిడుగురాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణం
- 47 ఎకరాల్లో రూ.500 కోట్లతో పనులు
- వంద ఎంబీబీఎస్ సీట్లతోపాటు 330 పడకల ఆస్పత్రి అందుబాటులోకి..
- ఈ ఏడాది చివరికల్లా ఓపీ సేవలు ప్రారంభం!
- 2025–26 విద్యాసంవత్సరం నుంచి ఎంబీబీఎస్ అడ్మిషన్లు



పిడుగురాళ్ల మండలం కామేపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాలు

సాక్షి, నరసరావుపేట: పిడుగురాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ప్రతి జిల్లాకు ఓ బోధనాస్పత్రి ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 16 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లి శివారున 47 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్ల వ్యయంతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ కళాశాల ఏర్పాటుతో 100 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. నర్సింగ్ కళాశాల, 330 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో వైద్యసేవలు ప్రజలకు చేరువ కానున్నాయి. ఎంబీబీఎస్ మొదటి ఏడాది అడ్మిషన్లు 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతాయని వైద్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీనికనుగుణంగా 2024 చివరి నాటికి మెడికల్ కళాశాలలోని అన్ని రకాల నిర్మాణాలూ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఏపీఎంఎస్ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పనిచేస్తోంది. ఇందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేసి పనులు చేపడుతోంది.

తొలుత ఓపీ సేవలు మొదలయ్యేలా...

మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం కావాలంటే దానికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రిలో కనీసం ఆరు నెలలపాటు ఓపీ సేవలు అందించాల్సి ఉంటుంది. దీంతో ఈ ఏడాది చివరికే ఓపీ సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పిడుగురాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ఓ ప్రముఖ సంస్థ రూ.343.77 కోట్లతో చేపట్టింది. జూన్ 25, 2022న నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మధ్యలో కొన్ని అవాంతరాలు ఎదురైనా ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. నిర్మాణ పనులను రెండు విడతలుగా విభజించారు. ఫేజ్–1లో ఆస్పత్రి, దాని అనుబంధ విభాగాలకు సంబంధించిన 12 బ్లాక్‌ల నిర్మాణం రూ.112 కోట్లతో జరుగుతోంది. ఈ పనులు రానున్న అక్టోబర్ నాటికి పూర్తయ్యేలా చూస్తున్నారు.



కళాశాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి(ఫైల్)

షిఫ్టుల వారీగా పనిచేస్తున్న 350 మంది కూలీలు..

ఫేజ్–2లో మెడికల్ కళాశాల, ల్యాబ్‌లు, విద్యార్థుల వసతి భవనాలను 17 బ్లాక్‌లుగా విభజించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో 12 బ్లాక్‌లకు సంబంధించిన భవనాలు శ్లాబ్ దశకు చేరుకున్నాయి. కళాశాల నిర్మాణ పనుల్లో 200 మందికిపైగా ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్, అసోంల నుంచి వచ్చిన కూలీలు పనిచేస్తున్నారు. స్థానికంగా మరో 150 మందికి ఉపాధి లభిస్తోంది. మొత్తంగా సుమారు 350 మంది షిఫ్టుల వారీగా 24 గంటల పాటు నిరంతరాయంగా శ్రమిస్తున్నారు. రోగులకు, వైద్యులకు, వైద్యేతర సిబ్బందికి సౌకర్యంగా ఉండేలా నిర్మాణాలు చేపడుతున్నారు. అత్యాధునిక వసతులతో కూడిన ఆపరేషన్ థియేటర్లు, ఓపీడీ కన్సల్టేషన్ గదులు సిద్ధం కానున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మెడికల్ కళాశాల నిర్మాణ పనుల వేగవంతానికి విశేష కృషి చేస్తున్నారు.

అత్యాధునిక వైద్యం దరి చేరుతుంది



పల్నాడుకు ఓ వైపు కాసు బ్రహ్మానందరెడ్డి నాగార్జున సాగర్ నిర్మిస్తే, మరో వైపు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.500 కోట్లతో 12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవనాలతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టారు. ఇది పూర్తయితే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వస్తుంది. సుమారు 500–600 మంది వైద్య విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. కాలు నొప్పి మొదలు గుండె నొప్పి వరకు ప్రతి జబ్బుకు పల్నాడు ప్రజలు విజయవాడ, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేకుండా స్థానికంగానే ఉచితంగా అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రానుంది. లక్ష్యం మేరకు నిర్మాణ పనులు సాగుతున్నాయి.

– కాసు మహేష్‌రెడ్డి, గురజాల ఎమ్మెల్యే

2024 చివరి నాటికి నిర్మాణాలు పూర్తి



పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పనులు వేగంగా, ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయి. రహదారుల నిర్మాణం, పిడుగురాళ్ల మున్సిపాలిటీ నుంచి నీటి సదుపాయం కల్పించే దిశగా పనిచేస్తున్నాం. రానున్న అక్టోబర్ నాటికి ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. అలాగే వచ్చే ఏడాది చివరి నాటికి అన్ని రకాల నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. నిరంతరం 350 మంది కూలీలతో పనులు జరుగుతున్నాయి.

– సీవీ రమణ, ఈఈ, ఏపీఎంఎస్ఐడీ, పిడుగురాళ్ల మెడికల్ కళాశాల


టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుపై కేసు

వినుకొండ: వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన అనుచరులపై వినుకొండ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు చెందిన వల్లభా డెయిరీ, పరిసర ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన అనుచరులు, టీడీపీ కార్యకర్తలు ధర్నా పేరుతో హంగామా సృష్టించారు. డెయిరీలోకి ప్రవేశించి విలువైన వస్తువులు, సామగ్రి అపహరించినట్లు డెయిరీ సిబ్బంది కోటా కిరణ్‌కుమార్ వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతోపాటు ఆయన అనుచరులు ఆరుగురు, మరికొందరు కార్యకర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాంబశివరావు మంగళవారం తెలిపారు.

ఆలయ కమిటీ నియామకం రద్దు

పాత గుంటూరు: ఆర్.అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆలయ కమిటీ ధార్మిక పరిషత్ నిబంధనల మేరకు రద్దు అయినట్లు ఆలయ ఈఓ దుర్గారావు తెలిపారు. ధార్మిక పరిషత్ సభ్యులు ఇటీవల ఏర్పడిన కమిటీ నియామకాన్ని పరిశీలించగా 30/1987 చట్టంలోని 17, 15 సెక్షన్ల ప్రకారం ట్రస్ట్ బోర్డు ఏర్పాటైంది కాదని తేలిందన్నారు. ధార్మిక పరిషత్ సభ్య కార్యదర్శి బోర్డును ఆమోదించలేదన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 516.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,088, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 6,438 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 814.60 అడుగుల వద్ద ఉంది.

జీఎస్టీ ఉద్యోగుల చేతివాటం

- అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైనం
- ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే దుకాణాలపై దాడులు
- విసిగిపోతున్న వ్యాపారులు



ఏసీబీ దాడిలో అదుపులోకి తీసుకున్న బ్రాడీపేట సర్కిల్ ఉద్యోగి(ఫైల్)

పాత గుంటూరు: గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని వస్తు సేవల పన్నుల విభాగం (ఎస్‌జీఎస్‌టీ) ప్రధాన కార్యాలయంలో అవినీతి తాండవిస్తోంది. కిందిస్థాయి ఉద్యోగులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో వారు పేట్రేగిపోతున్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. కొత్త వ్యాపారం కనిపిస్తే చాలు వాలిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కిళ్ల విభజన, అధికారుల బదిలీల అనంతరం వారి మధ్య ఆధిపత్య పోరు, సర్కిళ్ల సరిహద్దు వివాదాల వల్ల ఒకటికి రెండుసార్లు ముడుపులు చెల్లించుకోవాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వేధింపులు భరించలేక కొందరు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.

వాణిజ్యశాఖ గుంటూరు 1, 2 డివిజన్ల పరిధిలో ఏడు సర్కిళ్లు ఉన్నాయి. వ్యాపార కేంద్రంగా పేరుగాంచిన గుంటూరు నగరంలోనే మూడు సర్కిళ్లు ఉన్నాయి. ఎస్‌జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి ఏటా వందల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. ఇటీవల సర్కిళ్ల విభజన, అనంతరం ఉద్యోగుల బదిలీలు జరిగాయి. నగరంలో సర్కిల్ సరిహద్దులను వార్డుల వారీగా విభజించడంతో అధికారుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్కిళ్ల ఉద్యోగులు ఒకరి తర్వాత ఒకరు వ్యాపార సంస్థలపై దాడులు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. జీఎస్టీ చెల్లిస్తున్నా లావాదేవీల ప్రక్రియ సరిగా లేదంటూ కొందరు ఉద్యోగులు దుకాణాల వద్ద నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు.

ఇవిగో నిదర్శనాలు

- ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే రింగురోడ్డులోని ఓ కల్యాణ మండపంలో జరుగుతున్న ఎగ్జిబిషన్ నిర్వాహకుల వద్దకు వెళ్లిన బ్రాడీపేట సర్కిల్ సీనియర్ అసిస్టెంట్ నాగప్రసాద్ రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.
- ఓ ఉద్యోగి బ్రాడీపేటలోని వస్త్ర దుకాణంలో రిజిస్ట్రేషన్ పరిశీలనకు వెళ్లి రూ.30 వేలు, వస్త్రాలు తీసుకున్నట్లు సమాచారం.
- పాత బకాయి వసూలుకు వెళ్లిన మరో ఉద్యోగి ఇద్దరు వ్యాపారుల వద్ద రూ.1.50 లక్షలు వసూలు చేసినట్టు తెలిసింది.
- కొత్తపేట సర్కిల్ పరిధిలో గడ్డిపాడులోని కార్ డెకార్స్ వ్యాపారి వద్ద కిందస్థాయి సిబ్బంది రూ.4 వేలు వసూలు చేసినట్టు సమాచారం.
- లాలాపేట సర్కిల్ పరిధిలో ఓ ఉద్యోగి ఏడు ఎలక్ట్రానిక్స్ దుకాణాల వద్ద రూ. 4 వేలు చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది.
- కొరిటెపాడులోని ఓ మెస్ వద్ద వసూళ్లలో సరిహద్దు వివాదం నెలకొంది.
- కాకాని రోడ్‌లోని క్లాత్ మార్కెట్ నిర్వాహకులు అంతకుముందు కొత్తపేట సర్కిల్ ఉద్యోగులకే ముడుపులు చెల్లించేవారు. విభజన అనంతరం ఆ మార్కెట్ పెదకాకాని సర్కిల్‌కు మారడంతో రెండు సర్కిళ్లకు లంచాలు చెల్లించుకోలేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని సమాచారం.
- కొత్తపేట సర్కిల్‌లోని గుంటగ్రౌండ్ ఎగ్జిబిషన్ నిర్వాహకుల నుంచి కిందిస్థాయి సిబ్బంది రూ. 15 వేలు వసూలు చేసినట్లు తెలిసింది.

వసూళ్లకు పాల్పడేవారిపై చర్యలు

ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా కిందిస్థాయి ఉద్యోగులు వ్యాపార సంస్థల వద్దకు వెళ్లకూడదు. బేఖాతరు చేసి వెళ్లే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. అలా వెళ్లడం వల్లే ఓ ఉద్యోగి ఏసీబీకి పట్టుబడ్డారు. వ్యాపార సంస్థల వద్దకు ఎవరైనా శాఖ ఉద్యోగులు వస్తే వీడియో తీసి మా దృష్టికి తీసుకురావాలి. కఠిన చర్యలు చేపడతాం.

– ఎ.శాంతారామ్. ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్, బ్రాడీపేట సర్కిల్

వర్షాలతో అప్రమత్తం

అధికారులకు జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

నరసరావుపేట: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం ఆయా శాఖల జిల్లా అధికారులతో కలిసి ఏడు నియోజకవర్గాలు, మూడు రెవెన్యూ డివిజన్లు, 28 మండలాల అధికారులతో వీడియోకాన్ఫరెన్సు ద్వారా జేసీ సమీక్ష నిర్వహించారు. అధిక వర్షాలతోపాటు సంక్షేమ పథకాల అమలుపైనా చర్చించారు.

కౌలు రైతులకు రుణ అర్హత కార్డుల జారీలో లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. బలవన్మరణానికి పాల్పడిన రైతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. పీఎం కిసాన్ పథకం అమలు, సివిల్ సప్లయ్స్, రీ సర్వే, ఎఫ్‌పీఓఎల్ఆర్, ఎఫ్‌లైన్ పిటిషన్లు, మ్యూటేషన్ల కార్యకలాపాలు, కరక్షన్స్, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు–పరిష్కారం, లంక భూములకు సంబంధించిన అంశాలు, పంపిణీకి భూముల గుర్తింపు తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు.



కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి సమీక్ష చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె.వినాయకం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, ఏడీలు, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మీ‘మాంస’

మేకపోతులు, పొట్టేళ్ల మాంసం విక్రయాలపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు బతికున్న, ఆరోగ్యంగా ఉన్న వాటినే వధించి అమ్ముతున్నారా? లేక చచ్చిన, జబ్బున పడిన వాటిని విక్రయిస్తున్నారా అనే మీమాంస సర్వత్రా వ్యక్తమవుతోంది. అమ్మకందారులు నిబంధనలు పాటించకపోవడం, అధికారులు చూసీచూడనట్టు వ్యహరించడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని బలిపీఠం ఎక్కిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మాంస విక్రయాలపై అనుమానాలెన్నో..
- ఏది బతికిందో .. ఏది చచ్చిందో ..
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- మంచిదని సొంతంగానే ముద్ర



సత్తెనపల్లిలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన కబేళా



వినుకొండలో అలంకార ప్రాయంగా ఉన్న కబేళా

సత్తెనపల్లి: జిల్లాలోని ప్రతి పట్టణంలో కబేళా ఉంటుంది. అక్కడ మాత్రమే మేకపోతు, పొట్టేళ్లను వధించాలి. వధకు ముందు పశువైద్యాధికారి వాటిని పరిశీలించాలి. ఎటువంటి జబ్బులూ లేవని ధ్రువీకరిస్తూ ముద్ర వేయాలి. కానీ చాలా పట్టణాల్లో ఇది జరగడం లేదు. అసలు పశు వైద్యాధికారుల జాడ కానరావడం లేదు. పురపాలక సంఘాల్లో మాత్రం వారి సేవలకు గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. విక్రయించే మాంసంపై చాలాచోట్ల మున్సిపాలిటీ ముద్ర ఉండడం లేదు. అదేమని అడిగితే పశువైద్యుడు రాలేదని బదులిస్తున్నారు.

వ్యాపారులు వేసిందే ముద్ర!

జిల్లాలోని నరసరావుపేటతోపాటు, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్ళ, దాచేపల్లి, గురజాల పట్టణాల్లో మేకపోతు, పొట్టేళ్లకు ముద్రలను వ్యాపారులే వేస్తుండటం గమనార్హం. కబేళాలు ఉన్నా.. రోడ్ల పక్కనే అపరిశుభ్ర ప్రదేశాల్లో వధిస్తున్నారు. వినుకొండలో కబేళా అలంకార ప్రాయంగా ఉంది. సత్తెనపల్లిలో ఇళ్ళ మధ్యలో కబేళా ఉండటంతో నిరుపయోగంగా వదిలేశారు. ప్రసుత్తం అది అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

జిల్లాలో ఇలా..	
జిల్లా జనాభా	: 21,00,000
మాంసాహారులు	: 13,00,000
ఆది,బుధవారాల్లో తినేవారు	: 10,00,000
వారంలో వధించే వేటలు, పొట్టేళ్లు	: 1100పైగా

అనుమానమొస్తే ఫిర్యాదు చేయొచ్చు..

మాంసం ఎరుపు రంగులో కమిలిపోయి ఉంటే వ్యాపారిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు గానీ, పశు వైద్యాధికారికి గానీ ఫిర్యాదు చేయవచ్చు. కొన్ని చోట్ల ఒక జంతువుకు ముద్ర చూపించి చనిపోయిన జంతువుల మాంసాన్ని విక్రయించే అవకాశం ఉంది. అటువంటి సమయంలో ముద్ర ఉందో లేదో పరిశీలించి అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

నిల్వ, కుళ్లిన మాంసం హానికరం



నిల్వ ఉంచిన, కుళ్లిన మాంసం తింటే అనారోగ్య సమస్యలు తప్పవు. డయేరియా సోకే ఆస్కారం ఉంది. జ్వరం కూడా రావచ్చు. ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం, గుండె, జీర్ణకోశ వ్యాధులు వస్తాయి. వధించిన జంతువుకు ఏదైనా వ్యాధి ఉంటే అవి సోకే ప్రమాదం ఉంది.

– డాక్టర్ లక్ష్మణరావు , సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

ప్రత్యేక దృష్టి సారిస్తాం



మేకపోతు, పొట్టేళ్లను వధించే సమయంలో నిబంధనలు పాటించేలా చూస్తాం. జబ్బులతో ఉన్న వాటిని వధిస్తే చర్యలు తప్పవు. అందరూ నిబంధనలు పాటించాల్సిందే. బహిరంగ ప్రదేశాల్లో జీవాలనూ వధించినా చర్యలు తప్పవు. పట్టణ శివారులో కబేళా ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

– కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

మణిపూర్ ఘటనకు ప్రధాని బాధ్యత వహించాలి

తెనాలిటౌన్: మణిపూర్‌లో కుకీ తెగ మహిళలపై జరుగుతున్న సామూహిక లైంగికదాడులకు, అమానవీయ ఘటనలకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలని, నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని క్రైస్తవ మైనారిటీ హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గొరికపూడి బాలరాజు డిమాండ్ చేశారు.

తెనాలి రూరల్ మండలం పెదరావూరులోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అరాచకాలను రూపుమాపడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎస్టీ, ఎస్సీ, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మామిళ్లపల్లిలో బజరంగ్ ఉచిత వైద్యశిబిరం

- హృదయ సంబంధ వ్యాధులకు పరీక్షలు
- 186 మందికి ఈసీజీ, 2డి ఎకో
- 37 మందికి యాంజియోగ్రామ్‌కు సిఫారసు
- నవయుగ దార్శనికుడు జగనన్న : ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



ముఖ్య అతిథిగా శ్రీశైల సారంగ నాథ పీఠాధిపతి హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజలకు అత్యున్నత స్థాయిలో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాబోయే కాలంలో మరింత స్థిరంగా విజయాలను సాధిస్తూ కొనసాగనున్నదని, భగవంతుని ఆశీస్సులతో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నాయకునిగా జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలవనున్నారని స్వామీజీ అన్నారు.

చేబ్రోలు: పొన్నూరు మండలం మామిళ్ల పల్లి గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మీ గుండె పదిలం కార్యక్రమంలో భాగంగా హృదయ సంబంధిత వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. జగన్నామ సంక్షేమ సంవత్సరం సంక్షేమ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు వైద్య పరీక్షలు, వైద్య సహాయాన్ని బజరంగ్ ఫౌండేషన్ శిబిరాన్ని నిర్వహించింది. శిబిరంలో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎవరూ చేపట్టని విధంగా వైద్య సంస్కరణలు అమలు చేస్తున్న నవయువ దార్శనికుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తిదాయకమైన కార్యాచరణ బజరంగ్ ఫౌండేషన్‌కు మార్గదర్శకమన్నారు. జగనన్న ప్రభుత్వ కార్యక్రమాలకు తోడుగా ప్రతి గ్రామంలో వైద్య, విద్యా సంబంధిత కార్యక్రమాలను చేపడుతున్నామని జగన్నామ సంక్షేమ సంవత్సరం కార్యక్రమాలలో భాగంగా మరిన్ని సేవా కార్యక్రమాలను రూపొందించామని, మరిన్ని గ్రామాలలో ప్రజలకు సేవలను అందించనున్నట్లు తెలిపారు. గ్రామ వలంటీర్ల సహాయంతో గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి గుండె సంబంధిత పరీక్షలను నిర్వహించి మందులను అందజేసే కార్యక్రమంలో సునాయసంగా జరిగిందన్నారు. వైద్య బృందం నిర్వాహకులు డాక్టర్ విజయచైతన్య, రాజేష్ తదితరులను ఘనంగా సత్కరించారు. వైద్య శిబిరం ముగింపు సభలో పాల్గొన్న గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన బజరంగ్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. మెడ్ స్టార్ హాస్పిటల్ వైద్యబృందం వైద్య సేవలు అందజేసింది. శిబిరంలో 186 మందికి ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి, అవసరమైన 37 మందికి తదుపరి వైద్య పరీక్ష యాంజియోగ్రాం చేయించుకోవలసిన పరిస్థితిని నిర్ధారించారు. వారందరికీ పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్సలను అందించనున్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, చిత్రంలో అంబటి మురళీకృష్ణ

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
సీల్డు టెండరు, ఇ-టెండరు మరియు బహిరంగ వేలం ఆర్.సి.నెం:పి1/2977/2023, తేది: 25/07/2023
1: శ్రీ అమ్మవారికి భక్తులు సమర్పించు ఎరుపు రంగు అట్ట చీర ముక్కలు, 6x10, 8x12 అంగుళముల సైజు గల ప్యాకింగ్‌తో కూడిన ముక్కలు, గాజులు, పసుపు కుంకుమలు ప్రోగుచేసుకొను లైసెన్స్ హక్కునకు జరుగు (సీల్డ్ టెండర్/బహిరంగ వేలం మాత్రమే) 2: కొండపైన స్వర్ణ గోపురం ఎదుట మరియు నూతన రాజగోపురం అవతల వైపు Spot Photos తీయుటకు లైసెన్సు హక్కు, 3: సెల్‌ఫోన్లు మరియు కెమెరాలు చార్జీ 1 కి రూ.5/-లు చొప్పున మాత్రమే రుసుము వసూలు చేసి భద్రపరచు లైసెన్స్ హక్కు అప్పగించిన తేది నుండి రెండు సంవత్సరముల కాలమునకు తేది:06-08-2023 న ఉ॥గం॥ 11-00 లకు మహామండపము 6వ అంతస్థు నందు జరుగు సీల్డు టెండరు / ఈ-టెండర్ / బహిరంగ వేలం ప్రారంభమగును. ఇతర వివరముల కొరకు ఫోన్: 8639464333, 9640595555 లను సంప్రదించగలరు. ఇ-టెండర్ షెడ్యూల్స్ ది.31-07-2023 ఉ॥ 10 గం॥ల నుండి www.apeprocurement.gov.in లో Endowments department Marketing నందు దర్శించవచ్చును.
ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు వివరములు కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.
కర్నాటి రాంబాబు, ఛైర్మన్, ధర్మకర్తల మండలి — సం/- డి. భ్రమరాంబ, కార్యనిర్వహణాధికారిణి

సీఎం జగన్ పాలనలోనే సామాజిక న్యాయం

మంత్రి అంబటి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. మంత్రి రాంబాబుతో కలిసి మంగళవారం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణ బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నిమ్మకాయల ఆయనను దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం 30వ తేదీన జరుగనున్న మిర్చియార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఏర్పాట్లపై చర్చించారు. మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వెనుకబడిన వర్గాలను సాధికారిత దిశగా అడుగులు వేయిస్తే... ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం జగన్ మొత్తం వ్యవస్థలోనే మౌలిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి రాజ్యాధికారం దిశగా వారిని బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకు అణగారిన వర్గాలకు అగ్రాసనం వేసిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని స్పష్టం చేశారు. అంబేద్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయులు ఆశించిన సామాజిక న్యాయాన్ని ఆచరణలో చేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని కొనియాడారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు చేశారని, అంతేకాక మొత్తం 137 కార్పొరేషన్లకు సంబంధించి 484 పదవులు ఇస్తే... అందులో 243 బీసీలకు ఇచ్చినట్లు తెలిపారు. ఆసియాలోనే అతి పెద్దదైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు) చైర్మన్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన నిమ్మకాయల రాజనారాయణను సీఎం జగన్ నియమించటం సంతోషదాయకమన్నారు. డైరెక్టర్ల నియామకంలోనూ పూర్తి సామాజిక న్యాయాన్ని పాటించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని సత్కరిస్తున్న నిమ్మకాయల, పక్కన మంత్రి రాంబాబు

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెనమలూరు: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ బుధవారం గంగూరు గ్రామ పర్యటన సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ రాజాబాబు ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గవర్నర్ పర్యటన సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలు రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలని సూచించారు. గవర్నర్, రైతులతో ముఖాముఖి మాట్లాడటానికి ఏర్పాట్లు చేయాలని, రైతులు పొందిన పథకాలు వివరించాలని తెలిపారు. వర్షాలు పడుతుండటంతో సభా ప్రాంగణాన్ని భారీ టెంట్లతో నిర్మించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ విజయ్‌కుమార్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి, జిల్లా వైద్యాధికారి గీతాబాయ్, జిల్లా ఉద్యానవన అధికారి జె.జ్యోతి, డీఆర్డీఏ పీడీ ప్రసాద్, పశువర్ధక శాఖ అధికారి డాక్టర్ దివాకర్, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీఓ సునీతా శర్మ తదితరులు పాల్గొన్నారు.


గంగూరులో గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

'ప్లాపస్'తో సేవలు-వివాదాలకు సత్వర పరిష్కారం

సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ



తెనాలి: ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వివిధ రకాల సేవలు, ఆయా సంస్థలతో తమకు గల వివాదాలను ఎలాంటి కోర్టు ఫీజు, ఖర్చు లేకుండా 'పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్' (ప్లాపస్) ద్వారా సత్వరమే పరిష్కారం పొందవచ్చని తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలోని 'పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్'తో న్యాయసేవల అధికార చట్టం 1987, సెక్షన్ 22,ఎలో పేర్కొన్న రోడ్లు, నీరు, ఆకాశయాన రవాణా సంస్థల సేవలు, తంతి, తపాల సేవలు, విద్యుత్, కాంతి, ప్రజలకు నీరు సరఫరా చేసే అన్ని సంస్థల సేవలు, ప్రజా పరిరక్షణ లేక పారిశుద్ధ్యంకు సంబంధించిన సేవలు, హాస్పిటల్ / డిస్పెన్సరీల సేవలు, బీమా సంస్థల సేవలు, బ్యాంకింగ్, ఇతర ఫైనాన్స్ సంస్థల సేవలు, విద్య, విద్యాసంస్థల సేవలు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, గృహ, రియల్ ఎస్టేట్ సేవలు, వివాదాలను 'ప్లాపస్'తో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టులో వ్యాజ్యం దాఖలు చేయకముందే, కోర్టుకు ప్రత్యామ్నాయంగా ఆయా వివాదాల పరిష్కారానికి 'ప్లాపస్'ను సేవా వినియోగదారులు లేదా సంస్థలు ఆశ్రయించవచ్చని వివరించారు. ఆయా సేవలు / వివాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి 'ప్లాపస్' ప్రయత్నిస్తుందని, లేనిపక్షంలో ప్రవేశపెట్టిన సాక్ష్యాధారాలను అనుసరించి వివాదాలను పరిష్కరించి తీర్పు వెలువరిస్తుందని తెలిపారు. ఈ తీర్పుపై ఎలాంటి అప్పీల్ ఉండదన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ విలువైన డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలని గీతాంజలి శర్మ సూచించారు.

జాషువా స్మారక కళాపరిషత్ జిల్లా అధ్యక్షులుగా సుశీలకుమార్

నరసరావుపేట: పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ జిల్లా అధ్యక్షుడిగా సంరక్షా సొసైటీ చైర్మన్ బీఆర్ సుశీల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దింటి యోహాను మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాపరిషత్ కోసం కృషిచేస్తూ మహాకవి జాషువా కీర్తిని ఇనుమడింప చేయాలని కోరారు.

పురందేశ్వరికి ఘనస్వాగతం


ర్యాలీగా వస్తున్న పురందేశ్వరి, బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించాక తొలి సారి గుంటూరు విచ్చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి మంగళవారం బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద ఉన్న టోల్‌గేటు వద్ద నుంచి భారీ గజమాలతో, కార్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్లి ఆమెకు స్వాగతం పలికారు. కాజా టోల్‌గేట్ నుంచి గుంటూరులోని సిద్దార్థ గార్డెన్స్ వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడక్కడ బీజేపీ మహిళ నేతలు పురందేశ్వరి నుదుట తిలకం దిద్ది ఘనస్వాగతం పలికారు.

యార్డుకు 34,959 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 34,959 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,777 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.15,500 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 12 వేల నుంచి రూ. 25,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,115 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

31లోపు ఈకేవైసీ చేయించండి

నరసరావుపేట: జిల్లాలో ప్రధానమంత్రి కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందే రైతులు అందరూ ఈనెల 31వ తేదీలోపు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ మంగళవారం పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో లబ్ధి పొందుతున్న వారు 2,10,763మంది ఉండగా 26,168మంది ఇంకనూ ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. రాబోయే లబ్ధి చేకూరాలాంటి తప్పకుండా వీరందరూ బయోమెట్రిక్, ఫోన్ ఓటీపీ లేదా ముఖచిత్రం ద్వారా ఈకేవైసీ చేయించాలన్నారు. ఆర్‌బీకేలలో పనిచేస్తున్న వలంటీర్లు, వ్యవసాయ సహాయకులు, గ్రామసచివాలయ సిబ్బంది లేదా మండల వ్యవసాయాధికారి ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. దీనికి సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే 83310 56916, 83310 56911, 83310 56905లను సంప్రదించాలని కోరారు.

లింగ నిర్ధారిత వీర్యం ద్వారా మేలు జాతి పశువులు

ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ జి.విజయకుమార్


లంకెలకూరపాడులో పశుప్రదర్శనను ప్రారంభిస్తున్న విజయకుమార్ తదితరులు

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): లింగ నిర్ధారిత వీర్యంతో చూడి కట్టించడం ద్వారా మేలు జాతి దూడలు పుట్టే అవకాశం ఉందని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ జి.విజయకుమార్ చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా చూడి కట్టిన పశువుల ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఎక్కువగా పెయ్య దూడలను పుట్టించడం వలన రైతులకు కావలసిన గేదెలను తయారు చేసుకోవచ్చన్నారు. పశువులపై పెట్టే ఖర్చు తగ్గుతుందన్నారు. దేశంలోనే మన రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై మొదటిసారిగా చేపట్టిందన్నారు. పల్నాడు జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డితో కలిసి ప్రారంభించారు. పల్నాడు జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి కె.కాంతారావు, నరసరావుపేట పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ నరసింహులు, సత్తెనపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకరరెడ్డి, ముప్పాళ్ళ, మాదల పశువైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు వర్షాలు

జిల్లాలో 418.0మి.మీటర్ల వర్షపాతం నమోదు

నరసరావుపేట: జిల్లాలో రెండు రోజుల నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లన్నీ చిత్తడిగా తయారయ్యాయి. సాగు పనులు చేసుకునేందుకు అనువుగా నేల తయారైందని రైతులు భావిస్తున్నారు. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లా మొత్తం 418.0మి.మీటర్ల వర్ష పాతం నమోదైంది. అంతకు ముందు రోజు 206.0 మి.మీ వర్షం కురిసింది. మొత్తం 28 మండలాల్లో గడిచిన 24గంటల వ్యవధిలో కురిసిన వర్షం పరిశీలిస్తే...బెల్లంకొండ మండలంలో అత్యధికంగా 32 మి.మీ వర్షం పడగా, రొంపిచర్లలో అత్యల్పంగా 3.0 మి.మీ వర్షం కురిసింది. మాచర్లలో 19.6, వెల్దుర్తిలో 6.0, దుర్గిలో 15.6, రెంటచింతలలో 20.4, గురజాలలో 15.2, దాచేపల్లిలో 16.0, కారంపూడిలో 16.6, పిడుగురాళ్లలో 21.4, మాచవరంలో 15.2, అచ్చంపేటలో 21.0, క్రోసూరులో 18.4, అమరావతిలో 18.0, పెదకూరపాడులో 17.8, సత్తెనపల్లిలో 18.6, రాజుపాలెంలో 13.8, నకరికల్లులో 20.6, బొల్లాపల్లిలో 11.8, వినుకొండలో 5.8, నూజెండ్లలో 7.2, శావల్యాపురంలో 9.2, ఈపూరులో 16.2, నరసరావుపేటలో 17.4, ముప్పాళ్లలో 16.2, నాదెండ్లలో 8.4, చిలకలూరిపేటలో 8.8, యడ్లపాడులో 7.2 మి.మీ వర్షం నమోదైంది. జిల్లా మొత్తంపై 31రోజుల్లో సాధారణ వర్షం 3666.7మి.మీ వర్షం పడాల్సి ఉండగా ఇప్పటివరకు 2188.6 మి.మీటర్ల వర్షం నమోదైంది. సగటున 131.0 మి.మీ కురవాల్సి ఉండగా 78.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

హెచ్‌ఎంలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ఆర్జేడీ సుబ్బారావు

బాపట్ల అర్బన్: పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా(సీమ్యాట్) ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్యకనుగుణంగా గుణాత్మక విద్యను అందించాలని సూచించారు. బోధన పర్యవేక్షణా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలు ఐసీటీపై మాస్టర్ ఫెసిలిటీ ట్రైనర్స్ శిక్షణనిచ్చారు. శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకురాలు ప్రతిష్ఠ, అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

డీపీఓ రాంబాబు



పర్చూరు(చినగంజాం): పారిశుద్ధ్యం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, అధికారులను ఆదేశించారు. మంగళవారం స్పందనలో ఫిర్యాదులను పరిశీలించేందుకు దేవరపల్లి గ్రామానికి వచ్చారు. అక్కడ బ్లీచింగ్ చల్లిన మురుగు కాల్వలు, రోడ్లను పరిశీలించి సర్పంచి, కార్యదర్శులతో చర్చించారు. గ్రామంలో మురుగు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు. అనంతరం ఆయన పర్చూరు పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మండలానికి రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించుకోవాలని సూచన చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గౌస్, దేవరపల్లి సర్పంచి లాజర్, ఉపసర్పంచి టీ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మినీలారీ బోల్తా..రాకపోకలు బంద్

నరసరావుపేటరూరల్: నరసరావుపేట-పిడుగురాళ్ల రహదారి మార్గంలో రావిపాడు సమీపంలోని శాంతినగర్ వద్ద మంగళవారం రాత్రి దాచేపల్లి నుంచి మిర్చిలోడుతో గుంటూరు వెళుతున్న మినీలారీ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాకొట్టింది. రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. పోలీసులకు సమాచారం అందటంతో లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్దరించారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

జాతీయ జూనియర్ త్రోబాల్ పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక


ఎంపికైన బాలబాలికల జట్ల క్రీడాకారులు


తెనాలి: తమిళనాడు రాష్ట్రంలోని తిరుపూర్‌లో ఈనెల 28, 29, 30 తేదీల్లో జరగనున్న 31వ జాతీయ జూనియర్ బాలబాలికల త్రోబాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక వివేకానంద సెంట్రల్ స్కూల్ క్రీడామైదానంలో జరిగిన ఈ ఎంపికలు జరిగాయి. అనంతరం బాలబాలికల జట్లను ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులకు తెనాలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, జాన్ కీట్స్, రావిపాటి వీరానాయణ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన తెనాలి రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు. ఎంపికైన జట్ల వివరాలిలా ఉన్నాయి.

రాష్ట్ర బాలికల జట్టు: పి.యామిని, ఎల్.సుష్మశ్రీ, సి.కల్పన (గుంటూరు), ఎస్.షైఫా అంజుమ్ (అనంతపూర్), టి.ఐశ్వర్య, యు.త్రివేణి, బి.శిరీష, టి.నీరజ (చిత్తూరు), సీహెచ్ సునీత, డి.చందన, ఎం.తేజశ్రీ (విశాఖ), టి.అంజలి (నెల్లూరు), స్టాండ్‌బైలుగా ఎస్.శ్రీలిఖిత (విశాఖ), ఎంఎం రితిఖ (అనంతపూర్), సౌమ్య (నెల్లూరు)

రాష్ట్ర బాలుర జట్టు: జి.మధు, వై.నామల్లికార్జున, పి.ఆకాష్‌బాబు (గుంటూరు), సి.పురుషోత్తం, బి. తేజో (చిత్తూరు), బి.ముకేష్‌కుమార్, ఈ.మనోజ్‌కుమార్, ఎం.జైసాయి (విశాఖ), బి.రవితేజ, టి.రత్నకుమార్, జె.రాజేష్ (పశ్చిమగోదావరి), రక్షిత్‌కుమార్ (అనంతపూర్), స్టాండ్‌బైలుగా సి.యశ్వర్ధన్(అనంతపూర్), జె.జయశ్రీవర్ధన్ (విశాఖ), వై.జీవన్‌కుమార్ (నెల్లూరు).

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హైదరాబాద్‌లో ఘటన


చెల్లి ఆకాష్(ఫైల్)

బాపట్ల: ఉపాధి కోసం ఊరు వదిలి వెళ్లిన యువకుడు హైదరాబాద్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. వివరాలు.. బాపట్ల మండలం నరసాయపాలేనికి చెందిన చెల్లి ఆకాష్(21) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఈవెంట్స్ చేసుకుంటూ ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇటీవల నరసాయపాలెం వచ్చిన ఆకాష్ ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఉండమని చెప్పిన ఈవెంట్ ఉందంటూ వెళ్లాడు. రాత్రి పని ముగించుకుని స్కూటీపై ఇంటికెళుతున్న సమయంలో స్కూటీ స్కిడ్ అయిపడ్డాడు. దీంతో బలమైన గాయాలైన ఆకాష్‌ను ఆలస్యంగా గుర్తించిన స్థానికులు అక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండగా తల్లి కూడా ఆనారోగ్యంతో బాధపడుతుంది. ఆకాష్ అక్క చదువుకుంటుంది. కుటుంబ మొత్తానికి ఆధారమైన ఆకాష్ మృతి చెందటంతో కుటుంబంతో పాటు నరసాయపాలెం గ్రామంలో మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకుచ్చి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మేదరమెట్ల: ఎదురుగా వచ్చిన బైకు, మోపెడ్‌ను ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని కృష్ణంరాజువారి పాలెం(రెడ్డిపాలెం) పాత మద్రాసు రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. చందలూరు గ్రామానికి చెందిన పెంట్యాల జనార్దన్‌రావు(60) భార్యతో కలసి మోపెడ్‌పై చందలూరు నుంచి ఒంగోలు వెళ్తున్నాడు. రెడ్డిపాలెం రోడ్డు సమీపానికి రాగానే ఒంగోలు వైపు నుంచి అతివేగంగా వచ్చిన బైకు ఢీ కొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు రోడ్డుపై పడిపోయారు. దీంతో జనార్దన్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్య గాయపడింది. సమాచారం అందుకున్న కొరిశపాడు ఎస్‌ఐ జీవీ చౌదరి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన మహిళను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌పై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్ఎంఐఎస్) పోర్టల్‌పై మంగళవారం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ యూపీహెచ్‌సీలో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయానికి చెందిన గణాంక అధికారి వి.వి. ప్రసాద్ పాల్గొని వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా పోర్టల్ గురించి వివరించారు. ఆ పోర్టల్ నిర్వహణలో ఇటీవల జరిగిన మార్పులకు అనుగుణంగా పట్టణ, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి పోర్టల్ నిర్వహణలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశంగా ప్రగతి సాధించి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయ గణాంక అధికారి ఎస్.లక్ష్మోజీ, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు ఇతర అధికారులు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ డైరెక్టు 10th, ఒకే సం॥లో ఇంటర్ 3సం॥ లలో B.Sc, B.Com, BAలను పొందుటకై సంప్ర: శ్రీసత్య సూర్య కాలేజ్ 4/18 బ్రాడీపేట, గుంటూరు. Ph: 9346446079
■ Paramedical - B.Sc. & Diploma కోర్సులు - Anesthesia, Cardiology, Radiology, M.L.T, O.T. Tech, Emergency, BPT, MPT, Forensic అర్హత.ఇంటర్.(C):9581384578, 9063615623
■ జీవన జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ తెనాలి కోర్సు లు: GNM (స్టాఫ్ నర్స్) 3సం॥, అర్హత ఇంటర్, కాల పరిమితి-3సం॥, SC, ST, BCలకు స్కాలర్‌షిప్ సౌకర్యం. సంప్ర॥ 9652998050

DISTANCE EDUCATION
■ ఇంటర్ ఫెయిలయ్యారా ! చింతించవద్దు - Join Inter One Sitting. Govt. Recognised Board. Exams : October - 2023. (C) Vijayawada : 91333 40140, 89774 25849

ONE SITTING
■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discont.) Exam in August. ✆ : 73383 76874

REAL ESTATE
■ చీరాల వాడరేవు రామాపురం బీచ్ దగ్గరలో పొలములు రిసార్ట్స్‌కి హోటల్స్‌కి అపార్ట్‌మెంట్స్‌కి Plots అమ్మదలచినా కొనదలిచినా సంప్రదించండి. GM రియల్ ఎస్టేట్స్ ✆ 93906 11839, 99485 86575

FLAT FOR SALE
■ గుంటూరు 6/18 బ్రాడీపేటలో శ్రీసాయి అపార్ట్‌మెంట్ నందు 1250 Sft ఉత్తరం ఫేసింగ్ గల 2BHK 3సెంటు 4ఫ్లోర్, 7లైట్లు,ట్రేలు అటాచ్డ్‌బాత్ అమ్మబడును. 9848715153 నో బ్రోకర్స్
■ అమరావతిరోడ్డు గోరంట్ల, గుంటూరులో ఇన్వెస్ట్‌మెంట్ రేసీకు అనుకూలంగా అపార్ట్‌మెంట్/విల్లాస్‌కు దగ్గరలో 1400చ॥గ॥లు తూర్పు ఫేస్, మొత్తంగా/ విడివిడిగా కావలెను. రేటు 16,000 గోరంట్ల విల్లాస్‌కు ప్రక్కన దక్షిణం ఫేస్ 30అడుగుల రోడ్డు 177చ॥గ॥ ప్లాట్ కలదు. రేటు 13,000 క్లియర్ టైటిల్, ప్లాట్ రిజిస్ట్రేషన్. 9502168948

TOLET COMMERCIAL
■ గుంటూరు అరండల్‌పేట 9వలైను 2వ అడ్డరోడ్డు D.No:6-9-28, గ్రౌండ్‌ఫ్లోర్, 2వఫ్లోర్, 3వఫ్లోర్ 1200 Sft సౌత్ ఫేసింగ్ కమర్షియల్‌కు అద్దెకు ఇవ్వబడును ✆9700118383

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనకు G.S.T. 5% అదనం

SERVICES
GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299
■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 9912105656
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ (100% జెన్యూన్) సంప్ర :✆ 945 945 3338

CHANGE OF NAME
■ I, GURIVINDAPALLI SURESH (Old Name),S/o GURIVINDAPALLI ANDRAIAH R/o. D.No.36-17-916, Nirupedala Colony, 2nd Lane, Guntur. Have changed my name as GURIVINDAPALLI JOHN PRASAD (New Name) S/o GURIVINDAPALLI ANDRAIAH. Here after my name known as GURIVINDAPALLI JOHN PRASAD (New Name) S/o. GURIVINDAPALLI ANDRAIAH.

WANTED
■ పేరేచర్ల ప్రముఖ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్స్ హెడ్ గార్డ్స్ అర్జంటుగా కావలెను. Qul:6th-ఇంటర్,వయస్సు:30-70, ఆకర్షణీయమైనజీతం, 12గం॥డ్యూటీ✆7386585946, 7386743664
■ లక్ష్మీపురం లోని ప్రముఖ లేడీస్ హాస్టల్‌కు వంట మాస్టర్ కావలెను.భార్యభర్తకి ప్రాధాన్యత కలదు. 7993564212, 8985264212
■ B.Sc Only: Raghavas B.C Charitable Foundation an NGO Requires Rural Based Young Energetic and Dynamic Excutive Manager Q: B.Tech, MBA (Degirable) with Command Over Computer Applications Making and Uploading Videos on Social Flatforms, Sal: 20,000 send Resume to raghavasbcs@gmail.com
■ Office Executives with Computer Knowledge and Office Assistants Xth Class Only Guntur Residents need apply for Auditors Office in Krishna Mahal Road Naaz Centre, Guntur. 9985268300, 8919254664
■ తెనాలిలో ఉన్న ఐ.టి.సి. డిపోలో పనిచేయుటకు సూపర్వైజర్లు, సేల్స్‌మెన్లు, డెలివరి హెల్పర్లు కావలెను. తెనాలి పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత. 9246459299 / 7013041212
■ Ltd కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్స్, టెలికాలర్స్, సూపర్వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీసు ఎగ్జిక్యూటివ్స్, మని రికవరీ, ఆఫీసు బాయ్స్, హెల్పర్స్. Q:10th-PG. జీ:10-20వేలు. 7989976590
■ గుంటూరు బ్రాడీపేట 3/1లోని Mandi Arabic Restaurantలో పనిచేయుటకు యువతీ యువకులు కావలెను. మంచిజీతం ఇవ్వబడును✆9856595959,9849977987
■ ప్రముఖ షోరూమ్ అరండల్‌పేట గుంటూరు నందు పనిచేయుటకు సేల్స్‌ఎగ్జిక్యూటివ్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. 9885088270, 9985485353
■ అమరావతిరోడ్డులో త్వరలో ప్రారంభం కానున్న ఓపెన్ ప్లాట్స్ కొరకు / ఏజెంట్స్ & రీసెల్లర్స్ కావలెను సంప్ర॥ ✆9502168948
■ తెనాలిలోని వైష్ణవి కాలేజీ హాస్టల్‌లో పని చేయుటకు మగ హాస్టల్ ఇంచార్జ్ కావలెను. హాస్టల్‌లో ఉండవలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి. వైష్ణవి కాలేజి, స్టేషన్ రోడ్. 9290769284
■ రిసెప్షనిస్టులు కావలెను. అహల్య నర్సింగ్ హోమ్ శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 0863-2225105, 9848590244, 7207143415
■ ప్రముఖుల ఇళ్ల వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషింట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం: 14-20K, వసతి + భోజనం, VJA. ✆ 91608 35559, 78158 35561
■ Need Electricians to work in OE Spinning Mills in Guntur, Andhra Pradesh. Ph: 9949481542
■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421.
■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పని చేయదానికి అభ్యర్థులు కావలెను. అర్హత: Qul: 10th to P.G, P/T-8000/-, F/T-12,500/- 8500509114
■ మీ మీప్రాంతాలలో ప్రముఖ లి॥ కంపెనీలో పార్ట్/ఫుల్ టైమ్ పనిచేయుటకు డిగ్రీ/డిప్లొమో చేసి స్మార్ట్ ఫోన్ గల స్త్రీ/పు కావలెను. సంప్ర॥ ✆ 94922 76504, 99634 09299.

ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97030 13015
97034 67843
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.